క్లుప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని మట్టెవాడ ఈఎల్ఎస్ఆర్ వద్ద వాల్వ్ మరమ్మతులు కొనసాగుతున్నందున ఆదివారం నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో ట్యాంక్ పరిధిలోని మట్టెవాడ, పోతన రోడ్డు, బట్టల బజార్, ఎల్లం బజార్, గ్రంథాలయం ప్రాంతం, పాపయ్యపేట చమన్, రామన్నపేట, బీట్ బజార్, పిన్నావారి వీధి, రఘునాథకాలనీ, ఓఎస్ నగర్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

కేయూలో ప్రాంగణ నియామకాలు

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల (కో ఎడ్యుకేషన్)లో హైదరాబాద్‌లోని 'సమ్ పాజిటివ్ కంపెనీ' శనివారం ప్రాంగణ నియామకాలు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేందర్ తెలిపారు. విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల (కో ఎడ్యుకేషన్), మహిళా ఇంజనీరింగ్ కళాశాల, తాళ్ల పద్మావతి కళాశాలకు చెందిన 150మంది సీఎస్సీ, ఐటీ విద్యార్థులు పాల్గొనగా, 41 మంది ఏ రౌండ్‌కు ఎంపిక అయినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రమణబాబు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సంచార వైజ్ఞానిక ప్రదర్శన

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు సంచార వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వింధ్యారాణి తెలిపారు. సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయోలజీ (సీసీఎంబీ) హైదరాబాద్, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రీయల్ అండ్ టెక్నాలాజికల్ మ్యూజియం బెంగుళూరు సౌజన్యంతో మొబైల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. హసన్‌పర్తి మండలంలోని పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతి విద్యార్థుల తోపాటు ఇంటర్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆర్‌సీఓ వింధ్యారాణి, కార్పొరేటర్ శివకుమార్, తహసీల్దార్ ప్రసాద్, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ సింధు, తదితరులు హాజరవుతారని తెలిపారు.

భూమి లేకున్నా 'రియల్' వ్యాపారం

హసన్‌పర్తి: ఓదంపతులు తమకు భూమి లేకున్నా.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ప్లాట్లు అగ్రిమెంట్ చేశాక.. సదరు ఖరీదుదారుడు రిజిస్ట్రేషన్ చేయమంటే ఇంటికి పిలిచి వారిపై దాడులకు పాల్పడుతున్నారు. తాజాగా వారి బారి నుంచి తప్పించుకున్న ఓ వ్యక్తి కాకతీయ యూనివర్సిటీ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. గోపాలపురానికి చెందిన సునీత, స్వామి దంపతులు భూమి లేకున్నా తమ ప్లాట్లు ఉన్నాయంటూ వ్యాపారం చేస్తున్నారు. వీరి వద్ద మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండలానికి చెందిన కాతరాజు వెంకటేశ్ 2020లో గోపాలపురం శివారులోని సర్వే నంబర్ 516/1 150గజాల స్థలం (ప్లాట్ నంబర్ 132)కు గజాల ప్లా కొన్నాడు. గజానికి రూ.13,500 చొప్పున ఒప్పందం కుదుర్చుకుని, బయానాగా రూ.11.50 లక్షలు ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఆతర్వాత రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ చేస్తే.. సునీత, స్వామి దంపతులు వాయిదా వేస్తూ వస్తున్నారు. నెల రోజుల క్రితం వెంకటేశ్ ఫోన్ చేయగా.. సునీత దంపతులు డబ్బులతో పాటు అగ్రిమెంట్ కాగితాలు తీసుకురమ్మని నమ్మించారు. వారి మాటలు నమ్మి ఇంటికి వెళ్లిన తర్వాత దాడి చేసి, ఒప్పంద పత్రాలు లాక్కునేందుకు యత్నించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

ఫొటోగ్రఫీలో శరత్‌బాబుకు ప్రథమ బహుమతి



కరీమాబాద్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల ఫొటోగ్రఫీ పోర్ట్రేట్ విభాగంలో వరంగల్ శంభునిపేటకు చెందిన వనం శరత్ బాబుకు ప్రథమ బహుమతి లభించింది. శనివారం గుడివాడ పింగళి వెంకయ్య రోటరీ ప్లాటినం జూబ్లీ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ శాఖ అడ్వైజర్ బత్తుల బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

నాలాను గుర్తించి పనులు చేపట్టాలి

హసన్‌పర్తి: రెవెన్యూ నక్ష ప్రకారం నాలాను గుర్తించి విస్తరణ పనులు చేపట్టాలని వరద ముంపు పరిష్కార సాధన సమితి అధ్యక్షుడు నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. సాధన సమితి సమావేశం శనివారం జరగగా, ఆయన మాట్లాడుతూ రెవెన్యూ మ్యాప్‌ను పరిగణలోకి తీసుకుని నీటి పారుదల, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేపట్టి నాలాను గుర్తించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న నాలా అశాస్త్రీయంగా ఉందని వాపోయారు. 2008వ సంవత్సరంలో కుడా ప్రకటన మేరకు నాలాను గుర్తించాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సభ్యులు మానుపాటి రవి, శ్రవణ్, సనత్‌కుమార్ పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపొందించుకోవాలి



మడికొండ హైస్కూల్ విద్యార్థులతో డీఈఓ అబ్దుల్ హై



మాట్లాడుతున్న డీఎస్ఓ సుభాష్

మడికొండ: విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని డీఈఓ అబ్దుల్‌హై విద్యార్థులకు సూచించారు. శనివారం మడికొండలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన పేరెంట్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా డీఈఓ పాల్గొని మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థిలోని సామర్థ్యాలు గుర్తించి ఆదిశగా రాణించేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని సూచించారు. ఈసందర్భంగా చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి, రెండో స్థానం పొందిన విద్యార్థులకు బ్యాడ్జీలు అందించారు. పాఠశాల హెచ్ఎం సంధ్యారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎంఓ రాధ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో..

మడికొండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఇందులో హెచ్.ఎం మల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులపై ఉపాధ్యాయులకు ఎలాంటి బాధ్యత ఉంటుందో.. అలాంటి బాధ్యత తల్లిదండ్రులకూ ఉండాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు బ్యాడ్జీలు అందించారు. మొదటి తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను శ్రీలత, మానస, మల్లికను విద్యా కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ సభ్యులు సృజన, రేణుక, ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, మన్నె చంద్రయ్య, రాజేశ్వరి, రమేష్, అరుణ, వేణుగోపాల్, హైమవతి, కమల, సరిత పాల్గొన్నారు.

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

కాశిబుగ్గ: పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పిల్లలపై వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి సుభాష్ అన్నారు. శనివారం వరంగల్ క్రిస్టియన్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎం (పేరెంట్ టీచర్స్ మీటింగ్)లో పాల్గొని ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉంటూ.. వారితో తగిన సమయం కేటాయించాలని, మర్యాదపూర్వకంగా ఉండాలని, ఇంట్లో వాళ్లు చదువుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం దేవరాజ్, ఉపాధ్యాయులు వీణ, వెంకట్‌రెడ్డి, రాములు, నారాయణరెడ్డి, దేవేందర్, సుజాత, కృష్ణమూర్తి, రాజయ్య, వెంకటేశ్వర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

27న టీటీసీ అభ్యర్థులకు పరీక్షలు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో 42రోజుల టీటీసీ సమ్మర్ ట్రైనింగ్ కోర్సులో ఈ ఏడాది జూన్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ లోయర్ గ్రేడ్ థియరీ ఎగ్జామినేషన్‌కు ముందు పరీక్షల్లో ఫెయిల్ అభ్యర్థులకు ఈనెల 27న పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై శనివారం తెలిపారు. 27న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు (ఎడ్యుకేషనల్ సైకాలజీ అండ్ స్కూల్ అడ్మినిస్ట్రేషన్), మధ్యాహ్నం 2గంటల నుంచి 3గంటల వరకు (మెథడ్స్ ఆఫ్ టీచింగ్ జనరల్), మధ్యాహ్న 3.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు (మెథడ్స్ ఆఫ్ టీచింగ్ స్పెషల్) పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయా పరీక్షలు రాసే అభ్యర్థులు ట్రైనింగ్ సెంటర్ పేరు, ట్రేడ్ పేరు, అభ్యర్థి పేరు టైప్ చేసి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ. తెలంగాణ.గౌట్.ఇన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడు చేసుకోవచ్చని డీఈఓ అబ్దుల్‌హై తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగాన్ని కేసీఆర్ ప్రభుత్వం అస్తవ్యస్తంగా మార్చిందని విమర్శించారు. మూడేళ్లుగా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నియమ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అలువాల నరేష్, నాయకులు ప్రవీణ్, వినయ్, అభిరామ్, సతీష్, వాసు, యశ్వంత్, శ్రీకాంత్, వెంకీ, సాహిత్, మహేందర్, వెంకన్న, నితిన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం



చిరుధాన్యాలతో వంట చేస్తున్న కవిత

హన్మకొండ చౌరస్తా: ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఎంతో ఉపకరిస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. హనుమకొండలోని లక్ష్మీపురంలో రికార్డు సేవా సంస్థ ఆధ్వర్యంలో 'చిరుధాన్యాలు - ఆరోగ్యం' అనే అంశంపై స్థానికులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన భారతావని నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో కుసుమ కవిత పలు రకాల వంటలు చేసి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీష్‌బాబు, మిల్లెట్స్ ప్రమోటర్ శ్రీనివాస్, తులసి, కల్యాణి, సంధ్య, భాగ్యలక్ష్మి, సంధ్య, లత పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్‌లోకి వెళ్తున్న జేఏసీ నాయకులు

హన్మకొండ అర్బన్ : 2018 ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రూ.5 వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం 2018లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా అది నేటికి అమలు కాలేదన్నారు. అర్హులైనవారికి విదేశీ విద్యానిధి అందించాలని, పేద రెడ్లకు రెడ్డి గురుకులాలు ఏర్పాటు చేయాలని, ఈడబ్ల్యూఎస్ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పత్తి సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా

వరంగల్: తెలంగాణ రాష్ట్రాన్ని తొమ్మిదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ పార్టీ మాటలు తప్ప చేసిందేమీ లేదని, ఏనుమాముల కాంగ్రెస్ నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని వర్ధన్నపేట కాంగ్రెస్ నేత, రిటైర్డ్ ఎస్పీ నాగరాజు అన్నారు. 14వ డివిజన్ ఏనుమాములలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా కోఆర్డినేటర్ అడప మహేష్, నాయకులు సొరం సుభాష్, సొరం ప్రభాకర్, దామెర భాస్కర్, సొరం చిన్ని, రమేష్‌గౌడ్, లాజర్, ప్రవీణ్, తిరుపతి, ఏకాంబరచారి, అభిలాష్, టోనీ, దాసు, జనార్దన్, సుమన్, రవి, కట్టయ్య పాల్గొన్నారు.

గద్దర్ సంస్కరణ సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్ సంస్కరణ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైల్వే నాయకులు

కాజీపేట రూరల్: ప్రజాకవి గద్దర్, సియాసిత్ ఉర్దూ పత్రిక సంపాదకుడు జహీరుద్దీన్ అలీఖాన్ సంస్కరణ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కాజీపేట రైల్వే ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కాకతీయ కళావేదికలో శనివారం ఆవిష్కరించారు. రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, రైల్వే ఓబీసీ సికింద్రాబాద్ జోన్ ప్రెసిడెంట్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్ సంస్కరణ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు, డీజిల్ షెడ్ చైర్మన్ వేద ప్రకాష్, కోకన్వీనర్లు భాస్కర్, రవీందర్, శ్రీనివాస్, మాధవరావు, నాగేష్, సుధాకర్, రాజయ్య, లక్ష్మీనారాయణ, దేవిప్రసాద్, రమాకాంత్, అయోధ్య, నవాబ్‌జాఫర్, సారంగపాణి, సత్యనారాయణ, వెంకటమల్లు, నర్సయ్య పాల్గొన్నారు.

చిందు కళాకారులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నయీంనగర్: చిందు యక్షగాన కళాకారులకు దళిత బంధు, గృహలక్ష్మి, డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకోవాలని హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గజవెల్లి కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో చిందు యక్షగాన కళాకారుల హనుమకొండ జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జలందర్ అధ్యక్షతన ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా గజవెల్లి కుమారస్వామి, గౌరవ అధ్యక్షుడిగా గజవెల్లి సారయ్య, ఉపాధ్యక్షుడిగా గడ్డం వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా గడ్డం చిరంజీవి, సంయుక్త కార్యదర్శిగా గడ్డం సమ్మయ్య, కోశాధికారిగా గడ్డం సుదర్శన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గజవెల్లి సారయ్య, గజవెల్లి కుమారస్వామి, గడ్డం వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

కాజీపేట: ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వారు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేద్దామని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌భాస్కర్ మాట్లాడారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఎలకంటి రాములు, సంకు నర్సింగ్, నాయకులు కాటపురం రాజు, సుంచు కృష్ణ, మిట్టపల్లి రవీందర్, రంజిత్‌కుమార్, ఎండీ.సోని, మహమూద్, పర్వీన్ ఖాన్, సయ్యద్ యాకూబ్, మర్యాల కృష్ణ, లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



ప్రచారం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

హన్మకొండ: గత ఎన్నికల హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని యువజన కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రేపల్లె రంగనాథ్ విమర్శించారు. హనుమకొండలోని హౌసింగ్ బోర్డు, కేఎల్ఎన్‌రెడ్డి కాలనీ, శాంతినగర్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని వివరించారు. యువజన కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు కొడిపాక గణేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్యామ్ సుందర్, భిక్షపతి, సతీష్ రెడ్డి, అఫ్జల్, వెంకట్ రెడ్డి, ఖలీం, రతన్ బ్రహ్మ, పద్మ, అన్వేష్, గోపాల్, రజిత, ఫయీద, రమ, రాకేష్, శ్రీనాథ్, సాయిశ్రీనాథ్, వరుణ్, రమేష్, రవి, సంపత్, కృష్ణ, కమల్, మణి, తయ్యబ్, సాధ్య, రాములు, మోహన్, మానస, ఉమేష్, దీపక్, శ్వేత, ప్రవీణ్ కుమార్, రాహుల్, పృథ్వీ పాల్గొన్నారు.

ఉపాధి చూపడం అభినందనీయం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటనారాయణ

నయీంనగర్: నిరుద్యోగ సమస్యను కేవలం రాజకీయ సమస్యగానే చూడకుండా, దానికి పరిష్కారం చూపడం కోసం తనవంతుగా జాబ్‌మేళాను నిర్వహించడం అభినందనీయమని విశ్రాంత ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. హనుమకొండ కిషన్‌పుర చైతన్య కళాశాలలో ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటనారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, పరకాల మాజీ ఎమ్మెల్యే జయపాల్, ఉమ్మడి వరంగల్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు నరహరి వేణుగోపాల్‌రెడ్డి, 2వ డివిజన్ కార్పొరేటర్ లావుడ్య రవినాయక్, నాగపురి రాజమౌళిగౌడ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ అసలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడిందే కొలువుల కోసమని, అయితే ఆ కల నెరవేరలేదని విమర్శించారు. జాబ్ మేళాలో 57 కంపెనీలు, 4,500 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 500 మందికి తక్షణమే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇండస్ ఫౌండేషన్ వలంటీర్లు, పలు కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



నగదు పురస్కారాలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ కరోనా బారినపడి మరణించిన పానుగంటి స్వరూప్‌రెడ్డి స్మారకార్థం స్వరూప్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌ను ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ స్వరూప్‌రెడ్డి సతీమణి సరితారెడ్డి, కుమారుడు క్రాంతిసంఘర్ష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనపర్చిన మర్కజీ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. కోలాశంకర్, సుమంత్, మానిక, శ్రీహితకు ఒక్కొక్కరికి రూ 2,500ల చొప్పున నగదును ట్రస్ట్ సభ్యులు పంపిణీ చేశారు. కోశాధికారి రంగారెడ్డి, ట్రస్టు సభ్యులు వల్లపైడి, కిరణ్‌కుమార్, కుటుంబ సభ్యులు పిచిరెడ్డి, విజయకుమార్, హెచ్ఎం ఉమ, ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట పాఠశాల అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న మొలుగూరి అనిత

వరంగల్: గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ కొత్తపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన మొలుగూరి అనితఆనందం తమ వంతు సహాయంగా రూ.10 వేలను విరాళంగా అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవర సాగర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ 'ప్రార్థించే పెదాల కన్నా సాయం చేసే చేతులు మిన్న' అని బడి అంటే గుడి లాంటిదని, పాఠశాలకు సేవ చేస్తే సమాజానికి, దేశానికి సేవ చేసినట్లని కొనియాడారు. గ్రామస్తులందరు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు సృజన, అమరావతి, సమ్మక్క, వేణు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

డిప్యూటీ కమిషనర్‌కు అభినందన

కాజీపేట: కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో ఇటీవల డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన గొడిశాల రవీందర్‌ను గౌడ సంఘం నాయకులు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ తాళ్లపల్లి రామస్వామి, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బుర్ర శ్రీనివాస్, జిల్లా ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు, బస్వా యాదగిరి, తాళ్లపల్లి శ్యాం పాల్గొన్నారు.

శ్వేతార్కలో గణపతి దీక్షలు ప్రారంభం

కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో గణపతి మండల దీక్షలను ఆలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంత మల్లయ్యశర్మ సిద్ధాంతి లాంఛనంగా శనివారం ప్రారంభించారు. గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని భక్తులు మండల దీక్షలను స్వీకరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో శ్వేతార్కుడికి పండితులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేసిన అనంతరం 20 మందికి మాలలు వేశారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ పాల్గొని గణపతి హోమం జరిపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ మేనేజర్ ఎల్.రవి, పీఆర్వో అయిత మణిదీప్, వ్యాఖ్యాత రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని పదవి నుంచి తొలగించాలి

హన్మకొండ: టీపీసీసీ చీఫ్ పదవి నుంచి రేవంత్‌రెడ్డిని తొలగించాలని గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ మహేందర్ నాయక్ డిమాండ్ చేశారు. గిరిజన వర్గీకరణ చేస్తామని ప్రకటించి గిరిజనుల మనోభావాలు దెబ్బ తీసేవిధంగా వ్యవహరించిన రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను హనుమకొండలోని తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద శనివారం దహనం చేశారు. గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు భాస్కర్ నాయక్, నాయకులు నవీన్ నాయక్, సురేష్ నాయక్, తిరుపతి నాయక్, ప్రకాశ్ నాయక్, శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు బియ్యం పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్‌లో ముంపు ప్రాంతాల వరద బాధితులకు బీజేపీ వరంగల్ తూర్పు కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో శనివారం ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు నేతృత్వంలో 6కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరస్వామి, కలకొట్ల రవి, సాగర్, రాహుల్ పాల్గొన్నారు.

తూర్పు టికెట్ పద్మశాలీలకు కేటాయించాలి

ఖిలా వరంగల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు పద్మశాలి కులస్తులకు కేటాయించాలని పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

కాశిబుగ్గ: మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ మందరాజు మాదిగ పిలుపునిచ్చారు. 19వ డివిజన్ ప్రతాప్‌నగర్‌లోని కమిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల అత్యవసర సమావేశం ఎంఎస్పీ వరంగల్ తూర్పు ఇన్‌చార్జ్ ఈర్ల కుమార్‌మాదిగ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ ఐత క్రాంతి, జన్ను అవినాష్, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలోని సోమేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ, భక్తాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలను పండితులు లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుంచు చంద్రయ్య, సుంచు శ్రీహరి, పోలు సాంబమూర్తి, పెసరు రాజు, టంటం వేణుస్వామి, సాయిదత్తు శర్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ

కాజీపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటిలో చికిత్స పొందుతున్న తెలంగాణ ఉద్యమకారుడు కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీకి చెందిన పాము రాజేష్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు సుంచు కృష్ణ, కల్పలత సూపర్ బజారు డైరెక్టర్ అయ్యాల దానం, బీఆర్ఎస్ నాయకులు వెనిశెట్టి రఘు, మర్యాల కృష్ణ పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి ఆరోగ్యంపై ఆరా

హన్మకొండ: అనారోగ్యానికి గురై చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న వరంగల్ జిల్లా జాగృతి అధ్యక్షుడు, కాకతీయ యూనివర్శిటీ తెలంగాణ ఉద్యమకారుడు యార బాలకృష్ణను రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ అధ్యక్షుడు డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి శనివారం పరామర్శించారు.

కొండా సురేఖ జన్మదిన వేడుకలు



కాశిబుగ్గ: అనాథ ఆశ్రమంలో సురేఖ జన్మదిన వేడుకలు

కాశిబుగ్గ /రామన్నపేట /ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖ జన్మదినం సందర్భంగా వరంగల్ కాశిబుగ్గ జంక్షన్, పోచమ్మమైదాన్ జంక్షన్లలో కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయుర్వేద ఆస్పత్రిలో పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ పండ్లు పంపిణీ చేశారు. 35వ డివిజన్ అధ్యక్షుడు రేణుకుంట్ల శివకుమార్ ఆధ్వర్యంలో శివనగర్‌లోని డాన్‌బాస్కో అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. పోచమ్మమైదాన్ ఎగ్బాల్ మినార్ సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు బెడిద వీరన్న, బోయిన దూడయ్య ఆధ్వర్యంలో వరంగల్ తూర్పుకోటలో శనివారం నిర్వహించారు.